"పాస్ విత్ ఆనర్ గా అయ్యేందుకు సర్వ ఖజానాల ఖాతాలను జమ చేసుకుని సంపన్నులుగా అవ్వండి"

ఈ రోజు బాప్ దాదా ఏ సభను చూస్తున్నారు? నేటి ఈ సభలో పిల్లలు ప్రతి ఒక్కరూ హైయ్యెస్ట్ (అత్యంత ఉన్నతమైనవారు) మరియు అవినాశీ ఖజానాలతో రిచెస్ట్ (అత్యంత సంపన్నమైనవారు) గా ఉన్నారు. ప్రపంచములోని వారు ఎంత రిచెస్ట్ అయినా కానీ, వారు ఒక్క జన్మ కొరకు రిచెస్ట్. ఒక జన్మ కూడా రిచెస్ట్ గా ఉంటారో, ఉండరో, అది కూడా నిశ్చితము కాదు. ఈ ప్రపంచంలో ఎవరు ఎంత రిచెస్ట్ అయినా కానీ, అది ఒక్క జన్మ కొరకే. కానీ మీరు - మేము అనేక జన్మలకు రిచెస్ట్ అని నిశ్చయము మరియు నషాతో అంటారు ఎందుకంటే మీరందరూ అవినాశీ ఖజానాలతో సంపన్నులు. మీరు ఈ సమయములోని పురుషార్థము ద్వారా ఒక్క రోజులో కూడా చాలా సంపాదన చేసుకునేవారు అన్నది మీ అందరికీ తెలుసు. ఒక్క రోజులో మీరు ఎంత సంపాదన చేసుకుంటారో మీకు తెలుసా? లెక్క తెలుసు కదా! ఒక్క అడుగులో పదమాలు అన్న గాయనము ఉంది, అనుభవము ఉంది. ఒక్క రోజులో బాబా ద్వారా, బాబా యొక్క జ్ఞానం ద్వారా, స్మృతి ద్వారా ప్రతి అడుగులో పదమాలు జమ అవుతాయి. కనుక మొత్తం రోజంతటిలో ఎన్ని అడుగులైతే స్మృతిలో వేస్తారో, అన్ని పదమాలను జమ చేసుకుంటారు. మరి ఇటువంటి సంపాదనను చేసుకునేవారు, ఖజానాలను జమ చేసుకునేవారు విశ్వములో ఎవరైనా ఉంటారా! లేక ఉన్నారా? విశ్వమంతా తిరిగి రండి, మీరు తప్ప మరెవ్వరూ ఇంతగా జమ చేసుకోలేరు, అందుకే బాబా అంటారు - ఆత్మలమైన మా భాగ్యము పరమాత్మ ద్వారా ఇంత శ్రేష్ఠంగా తయారైంది అన్న శ్రేష్ఠ స్మృతిలో ఉండండి.

మీ ఖజానాలైతే తెలుసు కదా! ఈ సంగమయుగ సమయము ఎంత శ్రేష్ఠమైనది అని సమయము యొక్క ఖజానా గురించి కూడా తెలుసు. ఏ ప్రాప్తి కావాలంటే ఆ ప్రాప్తిని అధికారిగా అయ్యి బాబా నుండి తీసుకుంటున్నారు. అన్ని అధికారాలనూ ప్రాప్తి చేసుకున్నారు కదా? ఒక్కొక్క శ్రేష్ఠ సంకల్పము ఎంతటి పెద్ద ఖజానా, సమయము కూడా పెద్ద ఖజానా, సంకల్పాలు కూడా పెద్ద ఖజానా, సర్వ శక్తులు అన్నింటికన్నా పెద్ద ఖజానా, ఒక్కొక్క జ్ఞాన రత్నము ఎంత పెద్ద ఖజానా, ప్రతి ఒక్క గుణమూ ఎంత పెద్ద ఖజానా. శ్వాస శ్వాసలోనూ స్మృతి చేయడం ద్వారా శ్వాస సఫలమవుతుంది అని ప్రపంచములోని వారు కూడా నమ్ముతారు. కావున మీ అందరి శ్వాస సఫలతా స్వరూపంగా ఉంటుంది, వ్యర్థంగా పోదు. ప్రతి శ్వాసలోనూ సఫలతా అధికారము ఇమిడి ఉంది. బాప్ దాదా పిల్లలందరికీ అన్ని ఖజానాలను ఒకే విధంగా ఇచ్చారు. అన్నింటినీ ఇచ్చారు మరియు సమానంగా ఇచ్చారు. ఒకరికి ఒక వంతు, ఇంకొకరికి 10 రెట్లు, మరొకరికి 100 రెట్లు... ఇలా ఇవ్వలేదు. అందరికి ఇచ్చే దాత, పిల్లలు ప్రతి ఒక్కరికీ అన్ని ఖజానాలను వారు బ్రాహ్మణులుగా అవ్వటంతోనే సమాన రూపములో ఇచ్చారు. కానీ ఖజానాలను ఎంత జమ చేసుకుంటారు లేక ఎంత పోగొట్టుకుంటారు అనేది స్వయంపై ఆధారపడి ఉంటుంది. మేము మొత్తం రోజంతటిలో ఎంత జమ చేసుకుంటాము లేక ఎంత పోగొట్టుకుంటాము అనేది ప్రతి ఒక్కరూ చెక్ చేసుకోవాలి. చెక్ చేసుకుంటూ ఉంటారా? తప్పకుండా చెక్ చేసుకోవాలి ఎందుకంటే ఇది ఒక్క జన్మ కొరకు కాదు, ప్రతి జన్మ కొరకు, అనేక జన్మల కొరకు జమ కావాలి. జమ చేసుకునే విధి తెలుసా? అది చాలా సహజమైనది. కేవలం బిందువు పెడుతూ వెళ్ళండి. బిందువు గుర్తుంటే జమ అవుతుంది. స్థూల ఖజానాలో కూడా ఒకటి పక్కన బిందువు (సున్నా) పెడుతూ వెళ్తే దాని విలువ పెరుగుతూ ఉంటుంది కదా! అలాగే ఆత్మ కూడా బిందువు, బాబా కూడా బిందువు మరియు డ్రామాలో ఏదైతే జరిగిపోయిందో దానికి కూడా ఫుల్ స్టాప్ అనగా బిందువు. ఒకవేళ ప్రతి ఖజానాను బిందువు రూపముతో గుర్తు చేసినట్లయితే జమ అవుతూ ఉంటుంది. అనుభవము ఉంది కదా! బిందువు పెట్టారు మరియు వ్యర్థమవ్వటము సమాప్తమై జమ అవుతుంటుంది. బిందువు పెట్టడం వస్తుందా? చాలా సార్లు ఏమవుతుందంటే బిందువు పెట్టడానికి ప్రయత్నిస్తారు కానీ బిందువుకు బదులుగా అది పెద్ద గీత అయిపోతుంది, బిందువుకు బదులుగా ప్రశ్నార్థకమైపోతుంది, ఆశ్చర్యార్థకమైపోతుంది. కనుక జమ ఖాతాను పెంచుకునేందుకు విధి బిందువు, మరియు పోగొట్టుకునేందుకు మార్గము పెద్ద గీత గియ్యటము, ప్రశ్నార్థకమును పెట్టడము, ఆశ్చర్యార్థకమును పెట్టడము. ఏది సహజము? బిందువే కదా! కనుక విధి చాలా సహజము, అదేమిటంటే - స్వమానము, బాబా స్మృతి మరియు అనవసరమైనవాటికి ఫుల్ స్టాప్ పెట్టడము.

బాప్ దాదా ఇంతకుముందు కూడా చెప్పారు - ప్రతిరోజు అమృతవేళ స్వయానికి స్వయం మూడు బిందువుల స్మృతి తిలకాన్ని పెట్టుకున్నట్లయితే ఒక్క ఖజానా కూడా వ్యర్థంగా పోదు, ప్రతి సమయము, ప్రతి ఖజానా జమ అవుతూ ఉంటుంది. బాప్ దాదా పిల్లలు ప్రతి ఒక్కరి ఖజానాల జమ చార్టును చూసారు. అందులో ఏం చూసారు? ఇప్పటివరకు కూడా జమ ఖాతా ఎంతైతే ఉండాలో అంతగా లేదు. సమయము, సంకల్పాలు, మాటలు వ్యర్థం కూడా అవుతున్నాయి. నడుస్తూ-నడుస్తూ ఉండగా అప్పుడప్పుడు సమయం యొక్క మహత్వము ఇమర్జ్ రూపంలో తక్కువైపోతుంది. ఒకవేళ సమయం యొక్క మహత్వము సదా గుర్తున్నట్లయితే, ఇమర్జ్ రూపంలో ఉన్నట్లయితే సమయాన్ని ఇంకా ఎక్కువగా సఫలము చేసుకోగలరు. మొత్తం రోజంతటిలో సాధారణ రూపంలో సమయం గడిచిపోతుంది. తప్పుగా గడుస్తుంది అని కాదు కానీ సాధారణంగా గడిచిపోతుంది. అలాగే సంకల్పాలు కూడా చెడు సంకల్పాలు నడవవు కానీ వ్యర్థంగా పోతున్నాయి. ఒక గంటను చెక్ చేసుకోండి, ప్రతి గంటలో సమయము కానీ లేక సంకల్పాలు కానీ ఎన్ని సాధారణంగా పోతున్నాయి? జమ అవ్వవు. అప్పుడు బాప్ దాదా సూచన ఇస్తే, బాప్ దాదాను కూడా ఎంతో ఓదారుస్తారు. బాబా, ఇటువంటి సంకల్పాలు కొన్నే వస్తున్నాయి, అంతే, ఇంకేమీ లేదు, సంకల్పాలలో కొద్దిగా నడుస్తుంది, సంపూర్ణమైపోతాము, బాగైపోతాము, ఇప్పుడింకా అంతిమ సమయం రాలేదు కదా, ఇంకా కొంచెం సమయం ఉంది కదా, సమయానికల్లా సంపన్నంగా అయిపోతాము అని అంటారు. కానీ బాప్ దాదా పదే పదే చెప్పి ఉన్నారు - బహుకాలపు జమ కావాలి. జమ ఖాతాను అంతిమ సమయంలో సంపన్నంగా చేసుకుంటాము, సమయం వచ్చినప్పుడు తయారైపోతాము అని ఇలా అనటం కాదు! బహుకాలము జమ చేసుకున్నది బహుకాలము నడుస్తుంది. వారసత్వం తీసుకోవటంలోనైతే అందరూ - మేము లక్ష్మీ-నారాయణులుగా అవుతాము అనే అంటారు. త్రేతాయుగమువారిగా అవుతారా అని చేతులెత్తమంటే ఎవ్వరూ చేతులెత్తరు. కానీ లక్ష్మీ-నారాయణులుగా అవుతారా అంటే అందరూ చేతులెత్తుతారు. ఒకవేళ బహుకాలపు జమ ఖాతా ఉంటే పూర్తి వారసత్వము లభిస్తుంది. ఒకవేళ కొంచెమే జమ ఉంటే పూర్తి వారసత్వము ఎలా లభిస్తుంది? అందుకే సర్వ ఖజానాలను ఎంతగా జమ చేసుకోవాలనుకుంటే అంతగా ఇప్పటి నుండే జమ చేసుకోండి. అయిపోతుందిలే, వచ్చేస్తాములే... ఇలా లే, లే అని అనకండి. ''చెయ్యాల్సిందే'' ఇది దృఢత. అమృతవేళ కూర్చున్నప్పుడు, మంచి స్థితిలో కూర్చుంటే - ఇది చేస్తాము, అది చేస్తాము, అద్భుతము చేసి చూపిస్తాము... అని లోలోపల మనసులో చాలా ప్రతిజ్ఞలు చేస్తారు. ఇది మంచి విషయమే. శ్రేష్ఠ సంకల్పాలను చేస్తారు. కానీ బాప్ దాదా అంటారు - ఈ అన్ని ప్రతిజ్ఞలను కర్మలోకి తీసుకురండి. కేవలం ప్రతిజ్ఞలు చెయ్యటమే కాదు కానీ ఏ ప్రతిజ్ఞలనైతే చేస్తారో వాటిని మనసా, వాచా మరియు కర్మలోకి తీసుకురండి. పిల్లలు సంకల్పాలు చాలా మంచి-మంచివి చేస్తారు, బాప్ దాదా ఆ సమయంలో సంతోషిస్తారు ఎందుకంటే ధైర్యాన్ని అయితే పెడుతున్నారు కదా. ఇలా అవుతాము, అది చేస్తాము... అని ధైర్యాన్ని అయితే చాలా మంచిగా పెడతారు. ఆ ధైర్యానికి బాప్ దాదా సంతోషిస్తారు. కానీ ఎప్పుడైతే కర్మలోకి వచ్చేది ఉంటుందో, అది అప్పుడప్పుడు అన్నట్లు అయిపోతుంది. ప్రతిజ్ఞ చెయ్యటము చాలా సహజము. కానీ కర్మలో చెయ్యటము అనగా చేసిన ప్రతిజ్ఞను నిలబెట్టుకోవటము. ప్రతిజ్ఞలు చేసేవారైతే ఎంతోమంది ఉన్నారు కానీ వాటిని నిలబెట్టుకోవటం విషయంలో నంబరువారుగా అయిపోతారు. కనుక సంకల్పాన్ని మరియు కర్మను, ప్లాన్ ను మరియు ప్రాక్టికల్ ను - రెండింటినీ సమానం చెయ్యండి. చెయ్యగలరు కదా? బిజినెస్ వారు వచ్చారు. బిజినెస్ వారికి వ్యాపారం చెయ్యటం తెలుసు కదా! జమ చేసుకోవటం తెలుసు కదా! ఇంజనీర్లు మరియు సైంటిస్టులు కూడా ప్రాక్టికల్ గా పని చేస్తారు. మరియు రూరల్ (గ్రామీణ) విభాగం వారు ఎవరైతే ఉన్నారో, బాప్ దాదా వారిని రూలర్ (పరిపాలకులు) అని అంటారు, ఎందుకంటే ఒకవేళ వీరు సేవ చెయ్యకపోతే ఎవ్వరూ ముందుకు వెళ్ళలేరు. కనుక వచ్చిన ఈ మూడు విభాగాల వారూ కర్మ చేసేవారు. కేవలం చెప్పేవారు కాదు, చేసేవారు. మరి మీరంతా చేసిన ప్రతిజ్ఞలను కర్మలోకి తీసుకువచ్చే ఆత్మలే కదా! లేక కేవలం ప్రతిజ్ఞలను చేసేవారా? ప్రతిజ్ఞ చేసే సమయంలోనైతే బాప్ దాదాకు ధైర్యాన్ని చూపించి సంతోషపరుస్తారు. బాప్ దాదా వద్ద పిల్లలు ప్రతి ఒక్కరూ చేసిన ప్రతిజ్ఞల ఫైల్ ఉంది. అక్కడ (వతనములో) ప్రతిజ్ఞల ఫైల్ ను పెట్టుకునేందుకు అలమారు లేక స్థలం కావలసిన పనేమీ లేదు. అప్పుడప్పుడు బాప్ దాదా తమ అలౌకిక టి.వి.ని అకస్మాత్తుగా ఆన్ చేస్తారు. సదా ఆన్ చేయరు కానీ అప్పుడప్పుడూ ఆన్ చేస్తారు, అప్పుడు అన్నీ వినిపిస్తాయి. పరస్పరంలో ఏదైతే మాట్లాడుకుంటారో, అది కూడా వింటారు. అందుకే బాప్ దాదా అంటున్నారు - వ్యర్థాన్ని జమ ఖాతాలోకి మార్చుకుని జమ చేసుకోండి.

బ్రాహ్మణులు అనగా అలౌకికమైనవారు. బ్రాహ్మణ జీవితం యొక్క మహత్వము చాలా గొప్పది. అందులో ప్రాప్తులు చాలా ఎక్కువ. స్వమానము చాలా గొప్పది. మరియు సంగమ సమయములో బాబాకు చెందినవారిగా అవ్వటము, ఇది అన్నింటికంటే గొప్ప పదమాల రెట్ల భాగ్యము, అందుకే బాప్ దాదా అంటారు, ప్రతి ఖజానాకు మహత్వాన్ని

ఇవ్వండి. భాషణ చేసేటప్పుడు ఇతరులకు సంగమయుగ మహిమ గురించి ఎంతగా వినిపిస్తారు. ఒకవేళ ఎవరైనా మీకు - సంగమయుగ మహిమను వినిపించండి అని టాపిక్ ఇస్తే ఎంత సమయం వినిపించగలరు? ఒక గంట వినిపించగలరా? టీచర్లు చెప్పండి. ఎవరైతే అలా వినిపించగలరో వారు చేతులెత్తండి. మరి ఇతరులకు మహత్యాన్ని వినిపిస్తున్నారంటే మీకు మహత్వము గురించి చాలా బాగా తెలుసు. బాప్ దాదా మీకు తెలియదు అని అనరు. వినిపించగలుగుతున్నారంటే తెలుసు కాబట్టే వినిపిస్తున్నారు కదా. కానీ జరిగేది ఏమిటంటే, అది మర్జ్ అయిపోతుంటుంది. ఇమర్జ్ రూపములో స్మృతిలో ఉండాలి, అది అప్పుడప్పుడు తక్కువైపోతుంది, అప్పుడప్పుడు ఎక్కువవుతుంది. కనుక మీ ఈశ్వరీయ నషాను ఇమర్జ్ రూపములో ఉంచుకోండి. ఆ, నేనైతే అలా అయిపోయానులే... అని అనుకోకండి. ప్రాక్టికల్ గా నేను అలా ఉన్నాను... అది ఇమర్జ్ రూపములో ఉండాలి. నిశ్చయము ఉంది కానీ నిశ్చయానికి గుర్తు ఆత్మిక నషా. కనుక మొత్తం రోజంతా ఈ నషా ఉండాలి. నేను ఎవరిని! అన్న ఆత్మిక నషా. ఈ నషా ఇమర్జ్ రూపములో ఉన్నట్లయితే ప్రతి క్షణమూ జమ అవుతూ ఉంటుంది.

ఈ రోజు బాప్ దాదా జమ ఖాతాను చూసారు, అందుకే ఈ రోజు విశేషముగా అటెన్షన్ ఇప్పిస్తున్నారు, సమయ సమాప్తి అకస్మాత్తుగా జరగనున్నది. తెలుస్తూ ఉంటుంది కదా, సమయము వచ్చేటప్పటికల్లా బాగైపోతాములే అని ఆలోచించకండి. ఎవరైతే సమయాన్ని ఆధారంగా చేసుకుంటారో, సమయం బాగు చేస్తుంది లేక సమయం వచ్చేటప్పటికి అయిపోతుందిలే... అని ఎవరైతే అనుకుంటారో, వారికి టీచర్ ఎవరయ్యారు? సమయమా లేక స్వయం పరమాత్మనా? పరమాత్మ ద్వారా సంపన్నంగా అవ్వలేకపోయారు కానీ సమయం సంపన్నంగా చేస్తుందా, దీనినేమంటారు? సమయం మీకు మాస్టరా లేక పరమాత్మ మీకు టీచరా? ఒకవేళ డ్రామా అనుసారంగా సమయం మీకు నేర్పించినట్లయితే లేక సమయం ఆధారముపై పరివర్తన జరిగినట్లయితే ప్రారబ్ధము కూడా సమయం వచ్చినప్పుడే లభిస్తుంది అన్నది బాప్ దాదాకు తెలుసు ఎందుకంటే అక్కడ సమయం టీచర్ అయ్యింది. సమయం మీ కోసం ఎదురుచూస్తూ ఉంది, మీరు సమయం కోసం ఎదురుచూడకండి. అది రచన, మీరు మాస్టర్ రచయిత. కనుక రచయిత కోసం రచన ఎదురుచూడాలి, మాస్టర్ రచయితలైన మీరు సమయం కోసం ఎదురుచూడకండి. అయినా అసలు ఇందులో కష్టమేముంది? సహజమైనదానిని స్వయమే కష్టంగా చేసుకుంటారు. కష్టమేమీ కాదు, కానీ కష్టంగా చేసుకుంటారు. మీకు ఏదైతే భారమనిపిస్తుందో, ఆ భారాన్ని బాబాకు ఇచ్చేయండి అని బాబా అంటున్నప్పుడు, అది ఇవ్వటము మీకు రావటం లేదు. భారాన్ని ఎత్తుతారు, మళ్ళీ అలసిపోతారు కూడా, మళ్ళీ - ఏం చెయ్యాలి, ఎలా చెయ్యాలి... అని బాబాకు ఫిర్యాదు కూడా చేస్తారు. మీపైకి ఎందుకు భారాన్ని ఎత్తుతున్నారు? మీ భారాలన్నింటినీ బాబాకు అర్పించెయ్యండి అని బాబా ఆఫర్ చేస్తున్నారు. 63 జన్మలు భారాన్ని ఎత్తే అలవాటు అయిపోయింది కదా! అలవాటుకు వశమైపోతున్నారు, అందుకే కష్టపడాల్సి వస్తుంది. అప్పుడప్పుడు సహజంగా, అప్పుడప్పుడు కష్టంగా అనిపిస్తుంది. ఏ కార్యమైనా సహజంగా అన్నా ఉంటుంది లేక కష్టంగా అన్నా ఉంటుంది, కానీ అప్పుడప్పుడు సహజంగా, అప్పుడప్పుడు కష్టంగా ఎందుకుంటుంది? ఏదో కారణముంటుంది కదా! కారణమేమిటంటే - అలవాటుకు వశమైపోతున్నారు. బాప్ దాదాకు పిల్లలు కష్టపడటము, ఇదే అన్నింటికంటే పెద్ద విషయంగా అనిపిస్తుంది. మంచిగా అనిపించదు. మాస్టర్ సర్వశక్తివంతులు, కానీ కష్టపడటమా? మీకు ఏ టైటిల్ ను ఇచ్చుకుంటారు? కష్టయోగులా లేక సహజయోగులా? లేకపోతే మేము సహజయోగులము కాము అని మీ టైటిల్ ను మార్చేసుకోండి. అప్పుడప్పుడు సహజయోగులు, అప్పుడప్పుడు కష్టయోగులా? అయినా యోగమంటే అసలు ఏమిటి? కేవలం స్మృతి చెయ్యటము, అంతే కదా! అంతేకాక శక్తిశాలీ యోగము ముందు కష్టమనేది ఉండనే ఉండదు. యోగమనేది లగనమనే అగ్ని. అగ్ని అనేది ఎంతటి కఠినమైన వస్తువునైనా పరివర్తన చేసేస్తుంది. లోహము కూడా మౌల్డ్ అయిపోతుంది. అటువంటప్పుడు ఈ లగనమనే అగ్ని కష్టాన్ని సహజం చెయ్యలేదా? చాలామంది పిల్లలు చాలా మంచి-మంచి విషయాలను వినిపిస్తారు. బాబా, ఏం చెయ్యాలి, వాయుమండలము అలా ఉంది, సహచరులు అలా ఉన్నారు, హంస-కొంగలు ఉన్నారు, ఏం చెయ్యాలి, పాత లెక్కాచారాలు అని అంటారు. ఇలా చాలా మంచి-మంచి మాటలను మాట్లాడుతారు. బాబా అడుగుతున్నారు - బ్రాహ్మణులైన మీరు ఏ కాంట్రాక్టును చేపట్టారు? విశ్వ పరివర్తన చేస్తాము అన్న కాంట్రాక్టును చేపట్టారు. మరి ఎవరైతే విశ్వాన్నే పరివర్తన చేస్తారో, వారు తమ కష్టాన్ని తొలగించుకోలేరా?

మరి ఈ రోజు ఏం చేస్తారు? జమ ఖాతాను పెంచుకోండి. అప్పుడు సహజయోగులము అని ఏదైతే చెప్తారో దానిని అనుభవము చేస్తారు. ఒక్కోసారి కష్టము, ఒక్కోసారి సహజము, ఇందులో మజా ఉండదు. బ్రాహ్మణ జీవితము అంటే ఆనందమయమైన జీవితము. సంగమయుగము ఆనందమయమైన యుగము. ఇది భారాన్ని మోసే యుగము కాదు. ఇది భారాన్ని దింపుకునే యుగము. కనుక చెక్ చేసుకోండి, మీ భాగ్యము యొక్క చిత్రాన్ని జ్ఞానమనే

దర్పణములో మంచిగా చూసుకోండి. అద్దమైతే ఉంది కదా? లేక లేదా? పగిలిపోలేదు కదా? అందరికీ అద్దం లభించిందా? మాతలూ, అద్దం లభించిందా లేక ఎవరైనా దొంగలించారా? పాండవులైతే సంభాళించటంలో తెలివైనవారు కదా? అద్దం ఉందా? చేతులైతే బాగా ఎత్తారు. మంచిది. మీ భాగ్యము యొక్క చిత్రాన్ని చూసుకోండి మరియు సదా మీ భాగ్యము యొక్క చిత్రాన్ని చూసుకుని వాహ్-వాహ్ అన్న పాటను పాడండి. వాహ్ నా భాగ్యము! వాహ్ నా బాబా! వాహ్ నా పరివారము! పరివారము కూడా వాహ్- వాహ్. ఫలానావారు చాలా వాహ్-వాహ్, కానీ ఫలానావారు కొద్దిగా ఇలాంటివారు అని అనకూడదు. వాహ్ నా పరివారము! వాహ్ నా భాగ్యము! మరియు వాహ్ నా బాబా! బ్రాహ్మణ జీవితము అనగా వాహ్-వాహ్! అయ్యో-అయ్యో అని అనుకునే జీవితము కాదు. శారీరక వ్యాధి ఉన్నప్పుడు కూడా అయ్యో-అయ్యో అని అనుకోకూడదు. వాహ్! అని అనుకోవాలి. ఇలా అనుకోవటము కూడా బరువును దించుతుంది. ఒకవేళ మీ బరువు 10 మణ్ ల (1 మణ్ - 40 కేజీలు) నుండి 3-4 మణ్ లకు తగ్గిపోతే మంచిదేనా లేక అయ్యో-అయ్యో అని అంటారా? ఏమంటారు? వాహ్, భారము దిగిపోయింది! అని అంటారు. అయ్యో, నా పాత్రే ఇంత! అయ్యో, నన్ను ఈ వ్యాధి వదలటమే లేదు! అని అనకండి. మీరు వ్యాధిని వదలాలా లేక వ్యాధి మిమ్మల్ని వదులుతుందా? వాహ్-వాహ్ అని అనుకుంటూ ఉంటుంటే వాహ్-వాహ్ అని అనుకోవటం వలన వ్యాధి కూడా సంతోషపడుతుంది. చూడండి, ఇక్కడ కూడా అలానే అవుతుంది కదా, ఎవరి మహిమనైనా చేసినప్పుడు వాహ్-వాహ్ అని అంటారు కదా, అలాగే వ్యాధిని కూడా వాహ్-వాహ్ అని అనండి. అయ్యో, ఇది నా దగ్గరకే ఎందుకు వచ్చింది, ఇది నాకే లెక్కాచారమా అని అనకండి. ప్రాప్తి ముందు లెక్కాచారము అసలేమీ కాదు. ప్రాప్తులను ముందు ఉంచుకోండి మరియు లెక్కాచారాన్ని కూడా ముందు ఉంచుకోండి, అప్పుడదేమి అనిపిస్తుంది? చాలా చిన్న విషయంగా అనిపిస్తుంది. ఉద్దేశ్యమేమిటంటే బ్రాహ్మణ జీవితంలో ఏం జరిగినా కానీ దానిని పాజిటివ్ రూపంలో చూడండి. నెగెటివ్ ను పాజిటివ్ చెయ్యటమైతే వస్తుంది కదా. నెగెటివ్, పాజిటివ్ కోర్సును కూడా చేయిస్తారు కదా! ఆ సమయములో మీకు మీరు కోర్సు చేయించుకుంటే కష్టము సహజమైపోతుంది. కష్టము అన్న మాట బ్రాహ్మణుల డిక్షనరీలో ఉండకూడదు. అచ్చా - ఏ లెక్కాచారాలు ఉన్నా, ఆత్మతో ఉన్నా, శరీరంతో ఉన్నా లేక ప్రకృతితో ఉన్నా, ఎందుకంటే ప్రకృతి యొక్క ఈ పంచ తత్వాలు కూడా కొన్ని సార్లు కష్టాన్ని అనుభవం చేయిస్తాయి, ఏ లెక్కాచారాన్ని అయినా యోగమనే అగ్నిలో భస్మము చెయ్యండి. ఏం చెయ్యాలో అర్థమైందా? జమ ఖాతాను పెంచుకోండి. మాటలలో కూడా సాధారణ మాటలు ఉండకూడదు, మాటలలో కూడా భిన్న-భిన్న భావాలు మరియు భావనలు ఉంటాయి, అంతేకాక మాటల ద్వారా భావము మరియు భావన తెలిసిపోతుంది. కనుక ఎల్లప్పుడూ ఏ మాటలు మాట్లాడినా కానీ, అందులో ఆత్మిక భావము ఉండాలి మరియు శుభమైన, శ్రేష్ఠమైన భావన ఉండాలి. మాటలు కూడా మరియు భావన కూడా. ఈర్ష్య, అసూయ, ద్వేషం... ఇవన్నీ మాయ భావనలు. సదా శుభ భావము మరియు శుభ భావన ఉండాలి. అలా ఉన్నాయా? చెక్ చేసుకోండి. సమయం యొక్క ఖజానా, మాటల ఖజానా, సంకల్పాల ఖజానా, శక్తుల ఖజానా, జ్ఞానం యొక్క ఖజానా, గుణాల ఖజానా... ఒక్కొక్క ఖజానాను చెక్ చేసుకోండి ఎందుకంటే ప్రతి ఖజానా యొక్క ఖాతాను జమ చేసుకోవాలి. ఈ అన్ని ఖజానాల ఖాతా నిండుగా ఉండాలి, అప్పుడే ఫుల్ మార్క్స్ అని అంటారు అనగా పాస్ విత్ ఆనర్ అని అంటారు. ఏదో ఒక్క ఖజానా తక్కువగా జమ అయి ఉంటే ఏమవుతుందిలే అని అనుకోకండి, పాస్ విత్ ఆనర్ గా అయ్యేందుకు అన్ని ఖజానాలలో ఖాతా నిండుగా ఉండాలి. అచ్చా - ఎవరైతే ఒక్క క్షణంలో తమ సంకల్పాలను ఎక్కడ కావాలంటే అక్కడ పెట్టగలము, ఏది ఆలోచించాలనుకుంటే ఆ ఆలోచనే నడుస్తూంటుంది అని అనుకునేవారు చేతులెత్తండి. ఒక్క క్షణంలో మైండ్ కంట్రోల్ అయిపోవాలి, ఇలా ఒక్క క్షణంలో అవ్వగలదా? ఒకవేళ అలా చెయ్యగలము అని అంటే వారు చేతులెత్తండి.

అచ్చా - ఈ వాయుమండలములో, మధుబన్ లో కూర్చుని ఉన్నారు. మధుబన్ యొక్క వాయుమండలము శక్తిశాలీ అయినది, ఈ వాయుమండలములో, ఈ సమయంలో మనస్సును కంట్రోల్ చెయ్యగలరా? నిమిషంలో చేసినా, క్షణంలో చేసినా చెయ్యగలరా? ఆత్మ పరంధామ నివాసిగా అయిపో అని మనసును ఆజ్ఞాపించండి. మనసు ఆజ్ఞను పాటిస్తుందా, పాటించటం లేదా అన్నది చూడండి. (డ్రిల్) అచ్చా!

నలువైపులా ఉన్న సర్వ ఖజానాలకు యజమానులైన పిల్లలు, సదా కష్టాన్ని క్షణంలో పరివర్తన చేసే సదా సహజయోగులు, సదా సంకల్పాలు, సమయం, మాటలు, కర్మలను శ్రేష్ఠంగా చేసుకునేవారు, సదా పొదుపు ఖాతాను పెంచుకునేవారు, సదా మనసుకు యజమానులు, మనసు-బుద్ధి-సంస్కారాలను ఆజ్ఞానుసారంగా నడిపించేవారు, అటువంటి స్వరాజ్య అధికారీ పిల్లలకు, దేశములో ఉన్నా, విదేశములో ఉన్నా కానీ మనసుతోనైతే దూరంగా లేరు, నలువైపులా ఉన్న ఇటువంటి పిల్లలకు బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు నమస్తే.

వరదానము:- ఉన్నతమైన తండ్రి, ఉన్నతమైన నేను మరియు ఉన్నతమైన కార్యము, ఈ స్మృతితో శక్తిశాలిగా అయ్యే బాబా సమాన భవ

ఏ విధంగా ఈ నాటి ప్రపంచములో ఎవరైనా వి.ఐ.పీ.ల పిల్లలు ఉన్నట్లయితే వారు తమను తాము కూడా వి.ఐ.పీ.గా భావిస్తారు. కానీ తండ్రి కంటే ఉన్నతమైనవారైతే ఎవ్వరూ లేరు. మేము అటువంటి ఉన్నతోన్నతుడైన తండ్రి సంతానమైన ఉన్నతమైన ఆత్మలము - ఈ స్మృతి శక్తిశాలిగా చేస్తుంది. ఉన్నతమైన తండ్రి, ఉన్నతమైన నేను మరియు ఉన్నతమైన కార్యము - ఇటువంటి స్మృతిలో ఉండేవారు సదా బాబా సమానంగా అవుతారు. మొత్తం విశ్వములో శ్రేష్ఠమైన మరియు ఉన్నతమైన ఆత్మలు మీరు తప్ప మరెవ్వరూ లేరు, అందుకే మీ గాయనము మరియు పూజయే జరుగుతుంది.

స్లోగన్:- సంపూర్ణత అనే దర్పణంలో సూక్ష్మ మోహపు బంధనాలను చెక్ చేసుకోండి మరియు ముక్తులుగా అవ్వండి.